

# బురుజువీధి కథలు

- కె.వి.రమణరావు



(వినగలిగితే భూగోళమ్మీద ప్రతి పదార్ధమూ, ప్రతి ప్రదేశమూ కథలు చెబుతాయి. మరి, మా బురుజువీధీ అందుకు మినహాయింపు కాదు. మా బురుజువీధి చెప్పిన, చెబుతున్న కథలు నెలకొకటిగా మీ కోసం...)



# 16. జీవనానందం

**జూన్ నెలలో** ఒక సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి వస్తున్నాను. గోశాలరోడ్డునుంచి మా బురుజువీధిలోకి తిరిగేచోట ఒక షాపులో చిన్నపని ఉండి ఆగాను.

ఎదురుగా కచేరిసత్రంలో బిచ్చగాళ్ల వంటల హడావుడి మొదలౌతూంది. గుంపులు గుంపులుగా చేరి నవ్వుతూ, సరదాగా కీచులాడుకుంటూ హుషారుగా ఉన్నారు.

గోశాలవైపునుంచి వస్తున్న మా యెదురింటి చలపతి నన్నుచూసి "యేమిటి కచేరిసత్రంవైపు దీక్షగా చూస్తున్నావు?" అన్నాడు నవ్వుతూ.

"వీళ్లను చూస్తే నాకెప్పుడూ ఆశ్చర్యమే. సంఘంనుంచి బయటికి నెట్టబడి ఏ సౌకర్యమూలేక దినదిన గండంగా బతుకుతున్నా యెంత ఆనందంగా వున్నారో చూడు. నాగరికసౌకర్యాలకూ ఆనందానికి సంబంధం లేదా?" అన్నాను.

"వాళ్లకు ఆశలు, ఆశయాలు, రేపటిగురించిన భయం వుండవనుకుంటా. వుంటే మనలాగే అశాంతిగా వుండేవాళ్లు" అన్నాడు చలపతి సాలోచనగా.

"మనమంతా నిత్యం వొకరితో వొకరు పోల్చుకుంటూ ఆ చట్రంలో యిరుక్కుపోయి ఆనందాన్ని పొందలేకపోతున్నామేమో?" అన్నాను.

చలపతి జవాబిచ్చేలోపలే నన్ను షాపతను పిలిచాడు.

షాపులో పని ఐపోయి మా బురుజువీధిలోకి తిరిగి ఇంటిదారి పట్టాము. వీధిలైట్లు ఇంకా వెలగలేదు. ఎప్పటిలాగే బురుజు నిశ్చలంగా చీకట్లో మాయమవడానికి సిద్ధమౌతోంది. ఇంటికి తిరిగొస్తున్నవాళ్లు, ఇంటిమీద బెంగతో వెళ్లిపోతున్న పనిమనుషులు, ఒకరిద్దరు తోపుడుబళ్లవాళ్ల అరుపులు, ఇళ్లముందు ఆడుకుంటున్న పిల్లలు. నదినుంచి వీస్తున్న గాలికి కొబ్బరిచెట్లు తలలూపుతున్నాయి. పూలచెట్ల సువాసనలు గాలిచల్లదనంలో కరిగివస్తున్నాయి.

చీకటిపడే సమయంలో మా బురుజువీధి అలౌకిక భావనను కలిగిస్తుంది. పొడవాటి వీధికి రెండువైపులా తీర్చిదిద్దినట్టున్న ఇళ్లు, దూరంగా గుడి గోపురం, రాయుడిగారి మేడ మధ్యన నదికవతల ఆకాశంలో చివరి సూర్యకిరణాల్లో మెరుస్తున్న ఎరుపు, నారింజ, ఊదా రంగులు.

"రోజూ చూసినా యీ సాయంకాలపు దృశ్యం గడచిపోతున్న కాలాన్ని గుర్తుచేస్తూనేవుంటుంది. వెళ్లిపోయిన కాలాన్ని సద్వినియోగం చేసుకోలేదేమో అన్న బెంగలోకి వెళ్లిపోతాము" అన్నాను చిన్నగానవ్వి.

"శ్రీశ్రీ అవతలి గట్టు, తిలక్ పాడువోయిన వూరు, పద్మరాజు పడవప్రయాణం గుర్తొస్తాయా" అన్నాడు చలపతి.

మా కుడివైపు అంటే బురుజువైపు ఒక ఇంటిముందు సామాన్లలారి ఆగివుంది. కొందరు మనుషులు సామాన్లు ఖాళీయింట్లోకి చేరవేస్తున్నారు.

"యెవరో కొత్తగా దిగుతున్నట్టున్నారు" అన్నాను.

"యెవరోకాదు ప్రకాశం, యింటివోనరే, యిక్కడికే బదిలీ అయిందిట" అన్నాడు చలపతి.

"ప్రకాశమా? యెన్నేళ్ల తరువాత వస్తున్నాడు! నాతో యెవరూ అనలేదే. 'వార్తల వనజమ్మ' వూర్లోవున్నట్టు లేదు" అంటూ చలపతికి బైచెప్పి ఇంటివైపు నడిచాను.

కాళ్లు కదుక్కుని హాల్లోకి వచ్చాను. వంటింట్లో మా ఆవిడ కామేశ్వరి కాఫీ తయారుచేస్తోంది. ఆమె ఏపని చేస్తున్నా అందులో లీనమై శ్రద్ధగా చేస్తుంది.

“ప్రకాశంవాళ్లు బదిలీమీద యీవూరొస్తున్నారు. ముందుగా సామాన్లు వచ్చేసాయి" అన్నాను.

"నేనూ యిందాకే విన్నాను. యెవరీ ప్రకాశం" అంది కామేశ్వరి.

“యిన్సూరెన్సు కంపెనిలో పని. యిరవైయేళ్ల తరువాత వుద్యోగపు చివరి దశలో వస్తున్నాడు. నేను హైస్కూల్లోవున్నప్పుడు ప్రకాశం కాలేజిలో చదివేవాడు. నాకంటే పెద్దైనా స్నేహంగా వుండేవాడు” అన్నాను.

“అతని పిల్లలు పెద్దవాళ్లే అయివుంటారు" అంది ప్రశ్నార్ధకంగా

“అబ్బాయి ముంబైలో ఫోటోగ్రఫి పిజీకోర్సు చేస్తున్నాడని, అమ్మాయి ఢిల్లీలో బియ్యే చేస్తూందని ఆమధ్యన విన్నాను. ప్రకాశం భావాలు కొన్ని విచిత్రంగా వుండేవి" అన్నాను.

కామేశ్వరి నాకు కాఫీ కప్పు అందించి ఎదురుగా కూర్చొని "అంటే?" అంది.

కామేశ్వరి రోజంతా పనిచేసినా మొహం ఎప్పుడూ ఫ్రెష్ గా ఉంటుంది. నవ్వినప్పుడు బుగ్గలు సొట్టపడతాయి. ఆమె ఎప్పుడూ కొత్తగానే కనపడుతుంది. కామేశ్వరి ఒక్కోసారి నాకు అర్థంగాకపోయినా ఆమె తనకు తాను అర్థమైన మనిషిగా కనిపిస్తుంది.

"ప్రకాశం గురించి చెప్పమంటే అలా చూస్తావేం?" అంది చిరుకోపంతో.

"నీలోవున్న చిత్రాలన్నీ గుర్తొస్తున్నాయి" అన్నా నవ్వుతూ.

"వాటితో నువ్వు యిన్నేళ్లుగా పడుతూనేవున్నావు పాపం. పోనీలే, అతనిగురించి చెప్పు" అంది తనుకూడా నవ్వి.

“ప్రకాశం సన్నగా, చామనచాయగా చూడ్డానికి బాగానే ఉండేవాడుగాని మంచి బట్టలు వేసుకోవడం, తలదువ్వుకోవడంలాంటివి పట్టించుకునేవాడుకాదు. అప్పటికే కళ్లజోడు వుండేది. వాళ్లమ్మకు మాఅమ్మకూ స్నేహం. ఆమె అప్పుడప్పుడూ వచ్చి మా అమ్మదగ్గర అతని గురించి ఆందోళన పడేది. కాలేజికి సరిగ్గా వెళ్లడని, రాత్రంతా మేడపైన రూములో సాహిత్యం పుస్తకాలు చదువుతూంటాడని, కొత్తబట్టలకు డబ్బిస్తే వేరేవాటికి ఖర్చుపెట్టేస్తాడని, వొక్కోసారి

యెక్కడికోవెళ్లి రెండ్రోజుల తరువాత వస్తాడని చెప్పేది. అతని స్నేహితుల్లో బస్సు మెకానిక్కులు, ప్రెస్సుల్లో వర్కర్లు, నదికవతల కొండల్లోని ఆదివాసీలుకూడా వుండేవాళ్లు. యివన్నీ మావీధి పెద్దలకి నచ్చేవికావు. ఐతే ప్రకాశానికి మార్కులు బాగనే వచ్చేవి. అంతేకాదు, అతను కాలేజి క్రికెట్ టీములో స్టార్ బ్యాట్స్ మ్యాన్" అన్నాను.

"మరీ అంత చిత్రమైన మనిషేం కాదే"

"అప్పట్లో మనవీధిలోని కుర్రాళ్లంతా బుద్ధిమంతులుగా వుండేవాళ్లు. అందుకే తేడా బాగా కనపడేది"

"మీ వీధిపెద్దల బాధపడలేక అలా నటించేవాళ్లేమో" కామేశ్వరి పెద్దగా నవ్వింది.

"ప్రకాశం తాతకు పొలాలేకాక బట్టలవ్యాపారం వుండేది. యిక్కడి చేనేతబట్టలు దూరప్రాంతాలకు సరఫరా చేసేవాడు. ప్రకాశం నాన్న స్కూలుఫైనల్ వరకు చదివాడు. యిక్కడే వుద్యోగం దొరకడంతో వ్యాపారం మానేసాడు. ఆయన మనవీధిపెద్దల దగ్గర కొడుక్కు బుద్ధి చెప్పమని మొరపెట్టుకునేవాడు. వాళ్లు పిలిచి కౌన్సెలింగ్ యిచ్చారుగాని ప్రకాశం పట్టించుకోలేదు. వాళ్లకు కోపమొచ్చి అతనిమీద 'చెడిపోయినవా'డని ముద్ర వేసారు"

"అతన్ని అర్థంచేసుకునే వోపిక మీ పెద్దలకుందని నేననుకోను"

"అతని మేడమీది గదిలో అలమార్లనిండా పుస్తకాలుండేవి. నాకు మంచి డిటెక్టివ్ నవలలిచ్చేవాడు. మనవీధిలోని సంస్కృత పండితుడు విశ్వమూర్తి యింటికి వెళ్లి ఆయనతో చర్చిస్తూవుండేవాడు. యెప్పుడైనా సాయంకాలాలు నదివొడ్డున రావిచెట్టుకింద కూర్చుని పుస్తకాలు చదువుకునేవాడు, పాటలు పాడుకునేవాడు. నేను చిన్నవాణ్ణైనా చనువుగా వొకసారి అతన్ని 'అందరిలా యెందుకుండడంలే'దని అడిగాను. అతను నవ్వి చాలా విషయాలు చెప్పాడు"

"యేంటవి?"

"'జీవితమంటే చిత్ర వర్ణపటం. నేను గానుగెద్దులాగ కాలం గడపను. మొన్నామధ్య వొక ఆర్కియాలజిస్టుతో హంపి వెళ్లే అవకాశం వస్తే కాలేజి మానేసివెళ్లాను. శిల్పులు, చేనేతవాళ్లు, సంగీతకారులు వొకరేమిటి, మనకోసం యెందరో యెన్నో సృష్టించారు. మనిషి సంచరించని కొండలోయల్లో యెంత అందంవుందో తెలుకోవాలంటే వెన్నెలరాత్రిళ్లు చూడాలి. విశ్వసంగీతం వినచ్చు. అంతెందుకు? చలిస్తున్న యీ నదిని సరిగ్గా చూసావా? చింపిరిజుట్టుతో చొక్కాలేని పసిపిల్లల పెద్దకళ్లల్లోకి యెప్పుడైనా చూసావా? యెప్పటికైనా మంచి ప్రపంచ సాహిత్యం చదువు. కళ్లు తెరిచి చుట్టూ చూడు. యెలా బతకాలో తెలుస్తుంది' అన్నాడు. అతని మాటలు నాకప్పట్లో సరిగ్గా అర్థంకాలేదనుకో"

"చాలా ఆసక్తికరమైన మనిషి"

"అతను డిగ్రీ పూర్తయ్యాక తిరుపతి యూనివర్సిటిలో యెమ్మేలో చేరాడు. యిన్సూరెన్స్ కంపెనిలో వుద్యోగంవచ్చి అపైన అతని అమ్మానాన్నలను తీసుకుని దూరంగా వెళ్లిపోయాడు. ఆమధ్యన వాళ్లిద్దరూ చనిపోయారని తెలిసింది. యిక్కడి యిల్లు అద్దెకిచ్చి వెళ్లిపోయాక ప్రకాశం యిటు రాలేదు. ఆతరువాత యీమధ్యే అతనిగురించి వినడం"

"కొంచెం భిన్నమైన మనిషే. పెళ్లై బాధ్యతలు నెత్తినపడిన తర్వాత కూడా అలాగే వున్నాడో, మార్పొచ్చిందో" అంది కామేశ్వరి లేచి వంటింట్లోకి వెళ్తూ.

సామాన్లు వచ్చిన నాలుగురోజులకు ప్రకాశం, అతని భార్యాపిల్లలు వచ్చారు. పిల్లలు రెండురోజులుండి సామాన్లు సర్ది వెళ్లిపోయారని, అతని ఆఫీసువాళ్లు, మావీధి పరోపకారి పాండురంగ, అతని భార్య సుశీల వాళ్లకి సహాయంచేసి భోజన ఏర్పాట్లు చేసారని తెలిసింది.

ఆ ఆదివారం పొద్దున నేను, కామేశ్వరి ప్రకాశం ఇంటికి వెళ్లాం. ప్రకాశం ఆదరంగా పలకరించాడు.

"అప్పటివాళ్లు చాలామంది యిక్కడే వున్నారని తెలిసింది. నేనే వచ్చి మిమ్మల్నందర్నీ కలవాలనుకుంటున్నాను" అన్నాడు అభిమానంగా.

వయసు పెరగడంవల్ల వచ్చిన మార్పులు తప్ప ప్రకాశం అలాగే ఉన్నాడు. బూతద్దాల కళ్లజోడు వచ్చింది. లూజు చొక్కా, దువ్వుకోని తల అలాగే ఉన్నాయి.

"నేవెళ్లేప్పటికి నువ్వింకా చిన్నవాడివి. యిప్పుడు పూర్తిగా యెదిగిన మనిషిలాగ వున్నావు. ఐతే ఆ ఫ్రెష్ నెస్ నీలో అలాగే వుంది" అన్నాడు నవ్వుతూ.

కామేశ్వరిని పరిచయం చేసాను. అతనూ తన శ్రీమతిని పిలిచి 'సుమిత్ర' అని పరిచయం చేసాడు. ఆడవాళ్లిద్దరూ లోపలికెళ్లారు. మేం హాల్లోనే కూర్చుని మా కుటుంబాలు, ఉద్యోగాల విశేషాలు మాట్లాడుకున్నాం. పాతవిషయాలను గుర్తుచేసుకున్నాం.

'అతని పిల్లలు స్వేచ్ఛగా వాళ్లకి నచ్చిన చదువులు చదువుకుంటున్నారని, ఆమధ్య బస్సులో వెళ్తూండగా ప్రమాదం జరిగి సుమిత్ర తీవ్రంగా గాయపడిందని, హైదరాబాదులో రెండుసార్లు ఆపరేషన్ చేసారని, నెలకుపైగా ఆమె ఆసుపత్రిలో ఉండాల్సివచ్చిం'దని చెప్పాడు.

గంటతరువాత సుమిత్ర, కామేశ్వరి బిస్కట్లు, కాఫీ తీసుకుని వచ్చారు. సుమిత్రను పరిశీలనగా చూసాను. బలహీనంగానే ఉండి కొంచెం కుంటుతోంది. మరో పావుగంట కూర్చుని 'వెళ్లొస్తా'మని మేము లేచాము. సరిగ్గా అప్పుడే మధ్యవయసులో వున్న ఆడమనిషి, మగతను లోపలికొచ్చారు. మాసినబట్టలు, చెదరిన తలలు, చిక్కిపోయివున్నారు. ప్రకాశం వాళ్లని కళావతి, రాజేశంగా పరిచయం చేసి,

"వీళ్లు చేనేత చంద్రయ్య పిల్లలు. కాలేజికి నాలుగుమైళ్ల అవతల వీళ్లవూరుంది. బట్టలు నేస్తారు. వీళ్ల తాత అంకయ్యను గురించి వినేవుంటావు, మెత్తటి ఖద్దరు నేసేవాడు. 'ఖద్దరుసిల్కు అంకయ్య' అని అప్పట్లో మంచి పేరుండేది. మాతాత వ్యాపారానికి ముఖ్య సరఫరాదారులు వీళ్లే " అన్నాడు.

"చిన్నప్పుడు విన్నాను" అన్నాను.

మేము వాళ్లను పలకరించి బయటకు వచ్చేసాము.

"ప్రకాశంయింట్లో టీవి తప్ప సోఫాలు, బీరువాలు, వాషింగ్ మెషీన్లలాంటి ఆధునిక సౌకర్యాలేవీ లేవు గమనించావా?" అంది కామేశ్వరి ఇంటికొచ్చేప్పుడు. 'ఔ'నంటూ తలవూపాను.

రెండువారాల తరువాత ఓరోజు పొద్దున మా సంక్షేమసంఘ సభ్యుడు రంగశాయి మా ఆఫీసులో పనిబడి నాతో మాట్లాడ్డానికి మాయింటికొచ్చాడు.

కాఫీతాగి తనొచ్చిన పనిగురించి మాట్లాడ్డం అయ్యాక ప్రకాశం ప్రసక్తి వచ్చింది.

"అతనికి చాలా అప్పులున్నాయట తెలుసా? చిన్నప్పట్నుంచి అతనేమీ మారలేదు. పెళ్లై పిల్లలు పుట్టాకన్నా జాగ్రత్తగా వుండాలిగదా" అన్నాడు రంగశాయి నిరసనగా.

"అతనికి డబ్బు లక్ష్యం వుండేదికాదు" అన్నాను.

"జీతం డబ్బులన్నీ అనవసరపు ఖర్చులకు తగలేసేవాడట. భార్యాపిల్లలతో యూరప్ కూడా వెళ్లొట్ట. మాలాంటివాళ్లమే వెళ్లలేదు, అతని స్థాయికి అది అవసరమా? యిండియాలో అంతర్జాతీయ సాహిత్యసభ, సినిమాలప్రదర్శన యెక్కడ జరిగినా అతను వుండాల్సిందేనట. భార్యకు ఆక్సిడెంటై బోలెడు ఖర్చైంది. పిల్లలింకా చదువుకుంటూనే వున్నారాయె. తినో, తినకో డబ్బు మిగిలించుకుంటేగదా అది అవసరానికి ఆదుకుంటుంది. అప్పుల్లో పీకల్లోతు కూరుకుపోయాడు. పోడూ మరి? తీర్చడానికి ఆ యిల్లు తప్ప మరో ఆస్తివుందా?" అన్నాడు రంగశాయి ప్రకాశంపట్ల జాలి ప్రదర్శిస్తూ.

నేనేమీ మాట్లాడలేదు. ఎదుటి మనిషి దూకుడుగా తన అభిప్రాయాన్ని ప్రదర్శిస్తే మాట్లాడీ ప్రయోజనం ఉండదు. ఆతరువాత రంగశాయి వెళ్లిపోయాడు.

"ప్రకాశంకాదు, మనవీధి పెద్దలే చిత్రమైనవాళ్లు. వాళ్లనుకున్నట్టుగానే అందరూ బతకాలనుకుంటారు. యెవరికి ఆపదొచ్చినా పుట్టెడు జాలి చూపిస్తారుగాని పైసా విదల్చరు" అంది కామేశ్వరి నాచేతిలోంచి ఖాళీకప్పులు అందుకుంటూ.

"మనిషికి ఆపదలు రాకుండా హెచ్చరించడమే సంఘం పని. యెవరైనా లెక్కచెయ్యకుండా నష్టపోతే ఆదుకోవడం దాని పని కాదేమో" అన్నాను

“అలాంటప్పుడు విమర్శించే హక్కు వాళ్లకు యెక్కడిది? ఆయన వాళ్లను సహాయం అడిగాడా? వదిలెయ్యచ్చుగదా!” అంటూ లోపలికెళ్లింది కామేశ్వరి.

మరోవారం తరువాత ఒకరోజు సాయంత్రం గుళ్లో చిన్న రిపేరు పనివుంటే వెళ్లాను. పూర్తయ్యేసరికి చీకటిపడింది. అంతకుముందు గంటనునుంచీ ఆకాశమంతా మేఘాలు కమ్ముకున్నాయి. బయటికివచ్చాక నదివొడ్డున మర్రిచెట్టుకింద కూర్చున్న ప్రకాశం కనపడ్డాడు. వెళ్లి పలకరించాను.

" నదీప్రవాహం క్షీణించడం తప్ప యిక్కడేమీ పెద్దగా మారలేదు. యిక్కడకూర్చుంటే చిన్నప్పటి సంగతులు జ్ఞాపకం వస్తాయి" అన్నాడు.

"నోస్టాల్జిక్ జ్ఞాపకాలు బావుంటాయి" అన్నాను.

"బావున్నా అవి జ్ఞాపకాలే. అనుభవాలే నిజం. వాటికి భౌతికత వుంటుంది" అన్నాడు.

మెరుపులు, ఉరుములు మొదలయ్యాయి. కరెంటుపోయి ఒక్కసారిగా అంతా చిమ్మచీకటైంది. మెరుపువెలుగులో నదికవతలి ఫ్యాక్టరీ నల్లటి గుట్టలా కనిపిస్తోంది.

“కరికళేబరంలా కదలని ఫ్యాక్టరి" అన్నాడు ప్రకాశం నవ్వి.

చినుకులు మొదలయ్యాయి. "పెద్ద వర్షం వచ్చేట్టుంది, వెళ్దాంపద" అన్నాను.

"యిలాంటప్పుడే ప్రకృతిని చూడాలి. మనుష్యులందరూ దాక్కున్న సమయంలోనే ప్రకృతి నిర్భయంగా వొళ్లు విరుచుకుని తనలోని రూపాలను తన్మయంగా చూసుకుంటుంది. యిది దాని ప్రభంజన రూపం" అని "రాయుడుమేడ వరండాలోంచి చూద్దాం పద" అంటూ లేచి దారితీసాడు.

ఇద్దరం రాయుడిగారి మేడ వరండాలోకి వెళ్లి అక్కడ మెట్లమీద కూర్చున్నాం. రాయుడుగారి కుటుంబం బెంగుళూరు వెళ్లింది, మేడలో ఎవరూలేరు. సెక్యూరిటి వాళ్లు వరండాలోనే మరోమూల ముడుచుకుని కూర్చున్నారు.

గాలితగ్గి వర్షం ఉధృతమైంది. ప్రకాశం మోకాళ్లమీద తలవుంచి నదిలోకురుస్తున్న వర్షంవైపు తదేకంగా చుస్తూ కూర్చున్నాడు. కాసేపటి తరువాత ఉధృతి, శబ్దం తగ్గాయి. మెరుపులు దూరంగా వెళ్లాయి.

"యిలాంటప్పుడు అడవిలో యేగుహలోనో, రాతికిందో వుండిచూస్తే దీని పూర్తిరూపం చూడగలం. వయసైపోయి శరీరపటుత్వం తగ్గి వెళ్లలేకపోతున్నాను" అన్నాడు.

"నీ ఆర్థికపరిస్థితి బాగలేదని అనుకుంటున్నారు" అని మనసులో తొలుస్తున్న మాటను బయటపెట్టాను.

"యెక్కడైనాసరే, సంఘంలో పెద్దలమనుకునేవాళ్లు లెక్కలేసుకుంటూ దేనివెంబడో పరిగెత్తుతూ అదే జీవితమనుకుంటారు. యితరుల్నికూడా అంచనా వేసి అవేభావాల్ని రుద్ది మానసికస్వేచ్ఛను హరిస్తారు. యెవరైనా తేడాగా వుంటే వాళ్లని బాధిస్తారు. యిదంతా వొక రుగ్మత. యీ రాయుడిమేడనే చూడు, పూర్వం అందులో యెంతమంది ఆడవాళ్ల

విలువైన జీవితాలు బందీలై నశించిపోయివుంటాయి? బందీలు చేసినపెద్దలకు తెలియనిదేమిటంటే వాళ్లుకూడా కొన్ని పాతభావాలకు బందీలే అని" అంటూ నవ్వాడు.

"కొన్ని లెక్కల వాస్తవాలను విస్మరించలేముగదా" అన్నాను.

వర్షం తగ్గుముఖం పట్టింది.

"నువ్వు విన్నది కొంతవరకు నిజమే సూర్యం. కాని నేనెందుకలా చేసాను అనేది వాళ్లెప్పటికీ అర్థంచేసుకోలేరు. మొదట్నుంచీ నేను వీలైనంతవరకు వర్తమానంలోనే బతికాను. కాలాన్ని అనుభవాలతో కొలుచుకున్నాను. మనిషి జీవితకాలాన్ని అతను తన్ను తాను మరచిపోయే అనుభవాల సంపుటితో కొలవాలి, డబ్బుతో వచ్చేవాటినిబట్టి కాదు. కొన్నిటికి డబ్బు ఖర్చయ్యేమాట నిజమే. అలా వుపయోగపడినంతవరకే డబ్బుకి విలువ. ఆపైన డబ్బుకి చిత్తుకాగితాలకి తేడాలేదు" అన్నాడు చేతులమీద వెనక్కి వాలి.

"మీరు యూరప్ యాత్రకికూడా వెళ్లారట. మనస్తాయికి యెక్కువకదా" అన్నాను చెయ్యి బయటికిపెట్టి చూస్తూ. వర్షం తగ్గింది.

"స్థాయిని అనుభవాలనుబట్టి నిర్ణయించాలి. రామప్ప, హలిబేడు శిల్పులు రాతిలోంచి జీవాన్ని వెలికితీసారు. మైకేలాంజిలో, దవిన్సిలాంటి కళాకారులెందరో మనిషి స్థాయిని పెంచారు. వాటిని చూసి అనుభూతి పొందకపోతే మనమాస్థాయిని అందుకోనట్టే. మనవాళ్ల తోలుమందం వల్ల అద్భుతాలు చేయగలిగిన మన రైతులు, కళాకారులు దరిద్రంలో మగ్గుతున్నారు. యీరోజు చేనేత చంద్రయ్య కుటుంబం యెన్నిఅవస్థలు పడుతోందో చూడు. మన తోలుబొమ్మలాట, యక్షగాన కళాకారుల్ని యూరప్ తీసుకెళ్లే ప్రాజెక్టులో మేము వెళ్లాం. కొంత ఖర్చు ఆ దేశాలు పెట్టుకున్నాయి. జీవితపు తృష్ణను గొప్ప అనుభవాలవైపు మళ్లించాలి. లేకపోతే బతికినట్టే కాదు"

"సంపాయించిందంతా అలాంటివాటికే పెట్టేస్తే యెలా? పిల్లలింకా చదువుకుంటున్నారు" అని "వెళ్దాం పద" అన్నాను లేచి నిలబడి.

"మీరనుకున్నంతగా నేలవిడిచిసాము చేసివుంటే నేను తహతి దీవిలో వుండిపోయేవాణ్ణి. అనుకోకుండా సుమిత్ర ప్రమాదంలో చిక్కుకోవడంవల్ల పెద్దమొత్తంలో అప్పు చెయ్యాల్సివచ్చింది. ప్రతిసమస్యకూ వొక పరిష్కారముంటుంది. మనకా ధైర్యముండాలంతే" అన్నాడు తనూ లేస్తూ.

ఆ తడిసినచీకట్లో అతన్ని వాళ్లింటిదగ్గర దిగబెట్టి ఇంటికి వెళ్లిపోయాను.

కొన్నిరోజులు గడిచిపోయాయి. ఒకరోజు సాయంత్రం నేనాఫీసునుంచి వచ్చేసరికి కామేశ్వరి విచారంగా కనపడింది.

"ప్రకాశం అప్పులు తీర్చడంకోసం యిల్లు తాకట్టు పెడుతున్నాడట. 'వార్తల వనజమ్మ' చెప్పింది" అంది.

"అతనికున్న ఆస్తంతా ఆ యిల్లేనే. పోగొట్టుకుంటాడేమో" అన్నాను.

"అతన్ని ఆదుకోవడానికి బదులు మన వీధి పెద్దల్లోనే కొందరు ఆయింటిని స్వంతం చేసుకోవాలని చూస్తున్నారట. కానీ ప్రకాశం బయటివాళ్లతోకూడా మాట్లాడుతున్నాడట" అంది.

"వ్యాపారదృష్టి వచ్చిందంటే యిక మనుషులు కనపడరు. యిల్లు తాకట్టు పెట్టకుండానే అతని అప్పులుతీరే దారి కనపడితే బావుండును" అన్నాను.

ఆ మూడోరోజే శ్రావణమాసం కార్యక్రమాలపై చర్చించడానికి మా ఎకైక స్త్రీ సభ్యురాలు సుగుణమ్మ ఇంట్లో మా సంక్షేమసంఘ సమావేశం జరిగింది. దిగుమతిచేసుకున్న పింగాణీ పాత్రల్లో ఖరీదైన ఉపాహారాలు తిన్న తరువాత కార్యక్రమాలన్నీ పోయినేడాదిలాగే జరపాలని నిశ్చయించారు.

మీటింగు పూర్తై పిచ్చాపాటి మాట్లాడుతుండగా ప్రకాశం ప్రసక్తి వచ్చింది. ప్రకాశం ఏమాత్రం బాధ్యతలేకుండా డబ్బు విచ్చలవిడిగా ఖర్చుపెట్టి, అనవసరంగా యాత్రలు చేసి ఇల్లమ్ముకునే స్థితికొచ్చాడని సభ్యులందరూ ఏకాభిప్రాయం వెలిబుచ్చారు. అతను జీవితాన్ని వృధా చేసుకున్నాడని తీర్మానించారు. పిల్లల చదువులను పట్టించుకోకుండా వారిని ఉద్యోగాలురాని కోర్సుల్లో చేర్చి వాళ్ల భవిష్యత్తు అగమ్యగోచరంగా చేసాడని విమర్శించారు.

"అతను వున్న వొకయిల్లూ తాకట్టు పెట్టకుండా మన సంఘం యేమైనా చేస్తే బావుండును" అన్నాడు చలపతి.

"మన సంఘం అతనికి తక్కువ వడ్డీకి ఆర్థికసహాయం చేస్తే అతను అప్పులు తీర్చుకోగలడు. నిలదొక్కుకున్నాక మన అప్పు తీరుస్తాడు. యిల్లు నిలబడుతుంది. ఆలోచించండి" అన్నాను నేను.

కొందరు మావైపు కోపంగా చూసారు.

"అతని తండ్రి వుత్తముడు. యిల్లు పోగొట్టుకోవడం మాకూ బాధగానే వుంది. మనం యిలా కొంతమందికి సహాయం చేసినమాట నిజమే. కాని చిన్నప్పట్నుంచి అతన్ని చూస్తున్నాం. వొట్టి నిలకడలేని మనిషి. అతనికిస్తే మనడబ్బు యిక తిరిగొస్తుందని నమ్మలేం" అన్నాడు మునిరెడ్డి. మిగతావాళ్లంతా అతన్ని బలపరిచారు.

"సూర్యం నువ్వు అందర్నీ మంచివాళ్లనుకుంటావు. యిక యీవిషయాన్ని యింతటితో వదిలేయ్" అన్నాడు ఉపాధ్యక్షుడు మూర్తి సమావేశాన్ని ముగిస్తూ.

బయటికి వచ్చి మాయిళ్లవైపు నడుస్తూండగా "మనసంఘంవాళ్లు ప్రకాశాన్ని ఆదుకోకపోతే మనమే ఆపని చెయ్యచ్చుగా?" అన్నాడు చలపతి.

"యెలా" అన్నాను.

"మనవీధిలో ప్రకాశాన్ని అర్థంచేసుకున్నవాళ్లు యెక్కువమందే వున్నారు. మనందరం తలాకొంచెం వేసుకుని ప్రకాశానికి వడ్డీలేని అప్పు యిస్తే సరిపోతుందిగదా" అన్నాడు.

"మంచి ఆలోచన" అన్నాను మా ఇంటివైపు నడుస్తూ. కామేశ్వరికి చెప్తే ఆమెకూడా అదేఅంది.

నాలుగురోజుల తరువాత చలపతీ, నేనూ ప్రకాశం ఇంటికి వెళ్లి అతనికి మా ఆలోచన చెప్పాము.

అతను నవ్వి "మీరు కొంచెం ఆలస్యంగా వచ్చారు. మొన్ననే యీయిల్లు బయటివాళ్లకి తాకట్టు పెట్టడం ఐపోయింది. ఐతే ఆపని చేసింది నా అప్పులు తీర్చడానికి కాదు. వాటికి నా జీతంనుంచి నెలనెలా కట్టే యేర్పాటు యెప్పుడో చేసాను" అన్నాడు

"మరెందుకు?" అడిగాడు చలపతి.

అతను కొంతసేపు మౌనంగా ఉండి, నావైపు చూసి, "ఆమధ్య వొకసారి నీకు పరిచయం చేసానుగదా. ఆ చేనేత చంద్రయ్య కుటుంబం చాలా యిబ్బందుల్లో వుంది. ఆడబ్బు కట్టకపోతే వాళ్లకు నిలువనీడకూడా వుండదు. మొన్ననే వాళ్లకి ఆ తాకట్టుడబ్బు సర్దేసాను" అన్నాడు.

"వాళ్లెవరికోసమో నువ్వు యిల్లు తాకట్టు పెట్టడమేమిటి?" అన్నాన్నేను ఆశ్చర్యంగా.

"వొక్కోసారి మనం చూడలేని నిజం మనకు వింతగా కనబడుతుంది. వాళ్లు యెవరో యెలా అవుతారు? వాళ్లు కష్టపడి గొప్పనేర్పుతో బట్టలు నేస్తే అవి అమ్మి మా తాత యీ యిల్లూ, పొలం అన్నీ సంపాయించాడు. మా తాత వాళ్లకు అన్యాయం చేసాడని నేను అనను. కాని మాకీ ఆస్తి యేర్పడ్డానికి వాళ్ల శ్రమే అధికం. మానాన్నా, నేను పోగొట్టగా మిగిలిందాంతోనైనా వాళ్లకి వుపశమనం కలగాలిగదా?" అన్నాడు.

మేము చాలాసేపు మాట్లాడలేకపోయాము.

"పోనీ మాదగ్గర డబ్బు తీసుకుని యిల్లు విడిపించుకో" అన్నాడు చలపతి.

ప్రకాశం నవ్వి "అందుక్కూడా మీరు ఆలస్యంగా వచ్చారు. అనుకోకుండా నాకు కొంత డబ్బొచ్చి పడింది. ఆఫీసునుంచి రావాల్సిన అరియర్స్ యెప్పటివో మొన్న యిచ్చారు. అంతర్జాతీయ పోటీల్లో మా అబ్బాయి ఫోటోలకు బహుమతులొచ్చాయి. అంతేకాదు, మావాడికి ఐక్యరాజ్య సమితి వాళ్ల వైల్డ్ లైఫ్ విభాగంలో ఫోటోగ్రాఫర్ గా వుద్యోగంకూడా వచ్చింది. వాళ్లు రీలొకేషన్ అడ్వాన్స్ యిచ్చారు. అవన్నీ కలిపి నిన్ననే పంపాడు. తాకట్టులో చాలాభాగం దాంతో తీరిపోతుంది. యిల్లు వెనక్కి వచ్చేస్తుంది" అన్నాడు.

"అబ్బాయికి మా అభినందనలు చెప్పు" అన్నాను నేను కొంత తేరుకుని.

"అమ్మాయికి కూడా చెప్తాను. ఆమెకు లండన్ స్కూల్ ఆఫ్ యెకనమిక్స్ లో మంచి స్కాలర్ షిప్పుతో పిజీలో సీటొచ్చింది" అన్నాడు ప్రకాశం.

"ఐతే యిద్దరికీ చెప్పండి" అన్నాడు చలపతి. కాసేపు తర్వాత నేను, చలపతి లేచి ఇళ్లకు బయలుదేరాము. అప్పటిక్కూడా మేమింకా పూర్తిగా తేరుకోలేదు.

నేను కామేశ్వరికి జరిగిందంతా చెప్పాను.

“ప్రకాశందే వృధాకాని జీవితం. మీ సంఘ పెద్దలు గొప్పగా చెప్పుకుంటున్న పద్ధతులకు అనుగుణంగా ప్రకాశం నడవకపోవడం వల్ల కక్షపెట్టుకుని ‘అతను యిల్లు అమ్ముకుంటాడని, అతని పిల్లలు వుద్యోగాల్లేక అవస్థలు పడతారని’ వాళ్లు యెదురుచూసారు. వాళ్లకి యిప్పటికైనా కొంత బుద్ధి రావాల్సివుంది. సమాజంకోసం యెంతోకొంత చేసేవారికి యేదోవొక రూపంలో సమాజం తిరిగియిస్తుంది" అంది కామేశ్వరి నవ్వి

"ప్రకాశం యిన్నేళ్లూ జీవనానందాన్ని అనుభవించాడు. యిప్పుడు అతని పిల్లలు జీవిత సాఫల్యాన్ని యిచ్చారు." అన్నాను నేనూ నవ్వుతూ.

(మా బురుజ వీధి చెప్పిన కథలు సమాప్తం)

Post your comments